

విజిలెన్స్ అధికారుల దాడి

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడులోగల రైస్‌మిల్లును విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.



యూజీసీ కోఆర్డినేటర్‌గా అశోక్‌కుమార్

ఏఎన్‌యూ: ఏఎన్‌యూ యూజీసీ విభాగ కో–ఆర్డినేటర్‌గా అంబేడ్కర్ చైర్ అధ్యాపకులు ఆచార్య వై.అశోక్‌కుమార్ నియమితులయ్యారు. వీసీ ఉత్తర్వులు అందజేశారు.



యార్డుకు 40,747 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 40,747 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 38,800 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

స్టూడెంట్ కిట్లకు ఇండెంట్ పంపాం

రాగానే పంపిణీ చేస్తాం

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు అవసరమైన స్టూడెంట్ కిట్ల కోసం ఇండెంట్ పంపామని, అవి రాగానే పంపిణీ చేస్తామని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. పాఠశాలలు పున:ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందని విషయమై "నాడు ఒరవడి–నేడు మొక్కుబడి" శీర్షికతో ఈనెల 5న 'సాక్షి' గుంటూరు జిల్లా ఎడిషన్‌లో ప్రచురించిన కథనానికి ఆమె స్పందించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్ర సమగ్రశిక్ష కార్యాలయానికి ఇండెంట్ పంపామని, సామగ్రి రాగానే పంపిణీ చేస్తామని తెలిపారు.

వరదతో అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిరూరల్ : కృష్ణానది ప్రకాశం బ్యారేజీకి ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వస్తుండడంతో గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కృష్ణానది తీరంలోని రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం రాత్రి ప్రకాశం బ్యారేజ్ వద్దకు 23,650 క్యూసెక్కుల వరద నీరు వస్తుందని 13,370 క్యూసెక్కుల వరద నీటిని ప్రకాశం బ్యారేజ్ గేట్లు ఎత్తి విడుదల చేయనున్నట్టు కలెక్టర్ వివరించారు.

2.5 మి.మీ. సగటు వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 13.4 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.6 మి.మీ. వర్షం పడింది. సగటున 2.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. ప్రత్తిపాడు 13.2, పెదనందిపాడు 4.2, తుళ్ళూరు 2.4, మంగళగిరి 2.2, పెదకాకాని 2, తాడేపల్లి 1.8 మి.మీ. వర్షం పడింది.

ప్రగతిని ఓర్వలేకే టీడీపీ విధ్వంసాలు

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ధ్వంసం చేసిన శిలాఫలకాన్ని పరిశీలించిన వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి నూరిఫాతిమా, డెప్యూటీ మేయర్ వజ్రబాబు
- వైఎస్సార్ సీపీ హయాంలో తూర్పులో 90 శాతం అభివృద్ధి
- విధ్వంస పాలనకు ప్రజలే చరమగీతం పాడతారు



ధ్వంసం చేసిన శిలాఫలకం వద్ద నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, పార్టీ నేతలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే టీడీపీ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ విధ్వంసాలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. గుంటూరు తూర్పు 54వ వార్డులోని రాజీవ్‌గాంధీ నగర్ 8వ లైనులో వైఎస్సార్ సీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ధ్వంసం చేసిన నేపథ్యంలో మంగళవారం ఆ ప్రాంతాన్ని నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, పార్టీ శ్రేణులతో కలిసి ఫాతిమా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడవకముందే టీడీపీ నేతలు విధ్వంసాలు, హత్యారాజకీయాలకు పాల్పడడంతో రాష్ట్ర ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. 54వ డివిజన్‌లో రూ.40 కోట్లతో అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, అర్బన్ హెల్త్ సెంటర్, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. అప్పటి శిలాఫలకాలను చూసి ఓర్వలేక స్వయంగా ఎమ్మెల్యే ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు. తమ ప్రభుత్వంలో ఇలాంటి విష సంస్కృతికి తావులేకుండా, కక్ష రాజకీయాలు చేయకుండా పాలన సాగించారని.. కానీ ఇప్పుడు టీడీపీ ఎమ్మెల్యే ఎస్సీ వార్డులో ఇలా విధ్వంసాలకు పాల్పడటం తగదని పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గంలో తన తండ్రి రూ.240 కోట్లతో 90 శాతం అభివృద్ధి పనులు చేశారని ఫాతిమా వివరించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త కృష్ణ జీవనోపాధి కోసం చిన్న దుకాణం పెట్టుకుంటే దానిని రాళ్లతో పగలగొట్టారని, గత ఐదేళ్లలో తాము ఎప్పుడూ ఇలాంటి దాడులు చేయలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం మానుకోవాలని, లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డెప్యూటీ మేయర్ వనమా వజ్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అరాచక పాలన చేస్తోందని విమర్శించారు. కార్పొరేటర్ మల్లవరపు రమ్య మాట్లాడుతూ ఎస్సీ వార్డులో జరిగిన అభివృద్ధిని చూడలేకనే టీడీపీ నేతలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అజయ్, మర్రి అంజలి, వైఎస్సార్‌సీపీ నాయకులు అగ్గిపెట్టి రాజు, పూనూరి నాగేశ్వరరావు, మల్లవరపు దాసు, దూపాటి సాల్మన్, షంషేర్, మేరి, అనిల్, రమేష్, వెంకట్, ఆనంద్, ప్రసాద్, కృపయ్య, నంబూరి మహేష్, విక్టర్, ఆళ్ల కిరణ్, శిరీష, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై తప్పుడు కేసులా?

- లాయర్ల ఆగ్రహం
- జిల్లా వ్యాప్తంగా కోర్టుల బహిష్కరణ
- రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సన్నద్ధం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: న్యాయవాదులపై తప్పుడు కేసులు పెట్టడాన్ని బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసును వాదించిన న్యాయవాదులపై అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ సోమవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో న్యాయవాదులు కోర్టులను బహిష్కరించారు. అక్రమ కేసులు ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సన్నద్ధమవుతామని ప్రకటించారు. గుంటూరు నగరంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి నేతృత్వంలో విధులను బహిష్కరించారు. సీనియర్ న్యాయవాదులు వై.కోటేశ్వరరావు (వైకే), గౌరీశంకర్ జిల్లా జడ్జి పార్థసారథిని కలిసి వినతిపత్రం అందజేశారు.

- మంగళగిరి కోర్టులో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు.
- పొన్నూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.రామకృష్ణ, కార్యదర్శి యామ కృష్ణ ఆధ్వర్యంలో కోర్టు విధులకు గైర్హాజరయ్యారు.
- తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు, గౌరీశంకర్, ఇతర న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.
- నరసరావుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమేట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులకు గైర్హాజరయ్యారు.
- గురజాల కోర్టులోనూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు.
- మాచర్ల కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు కె.శ్రీనివాసరావు, షేక్ నాగిరెడ్డి, జి.సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరెడ్డి, ఎ.బాలాజీరెడ్డిలతోపాటు న్యాయవాదులు సోమవారం విధులకు గైర్హాజరయ్యారు. సివిల్‌జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు.
- పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి, కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులకు గైర్హాజరై నిరసన తెలిపారు. న్యాయవాదులపై తప్పుడు కేసు నమోదు చేయడాన్ని ఖండించారు.
- వినుకొండ పట్టణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎం.వి.నాయుడు, కార్యదర్శులు నాగరాజు, పఠాన్ గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, న్యాయవాదులు విధులు బహిష్కరించారు.
- సత్తెనపల్లి పరిధిలోని నాలుగు కోర్టుల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించి న్యాయదేవత విగ్రహం ఎదుట నిరసన తెలిపారు.
- బాపట్ల పట్టణంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లీలాకృష్ణ, న్యాయవాదులు అవినాష్ నాయుడు పాల్గొన్నారు. రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశన వెంకట గోపాలరావు, కార్యదర్శి పి.భూషణం పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పానీపూరి వాలా

- ఆహ్వానం పంపిన కేంద్ర ప్రభుత్వం
- పీఎం స్వనిధి యోజనలో క్రమం తప్పకుండా రుణం చెల్లింపుతో దక్కిన గౌరవం

తెనాలి: మేఘావత్ చిరంజీవి చిరువ్యాపారి.. తన ఇంటికి దగ్గర్లోనే పానీపూరి బండి నిర్వహణతో జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే వేడుకల్లో పాల్గొనాల్సిందిగా ఆయనకు కేంద్రప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. పోస్టల్ శాఖ నుంచి ఆహ్వాన పత్రాన్ని అందుకున్న ఆయన ఆనందానికి అవధుల్లేవు. తెనాలి బాలాజీరావుపేటలోని లింగారావు వీధిలో నివాసం ఉంటున్న చిరంజీవి 15 ఏళ్లుగా ఇంటికి దగ్గర్లోని రహదారిలో పానీపూరి విక్రయిస్తున్నారు. 2021లో వ్యాపార అవసరం కోసం పీఎం స్వనిధి పథకం ద్వారా రూ.10 వేల రుణాన్ని అందుకున్నారు. 2022లో రూ.30 వేలు, 2023లో రూ.50 వేల రుణాన్ని తీసుకున్నారు. క్రమతప్పకుండా నిర్ణీత వాయిదాలు చెల్లించారు. పానీపూరి కోసం వచ్చే వినియోగదారులను డిజిటల్ చెల్లింపులకూ ప్రోత్సహించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం చిరంజీవిని స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానించింది. దీనిపై చిరంజీవి, అతడి భార్య వెంకటేశ్వరమ్మ సంతోషం వ్యక్తం చేశారు. మెప్మా అధికారులు ఈ నెల 12న చిరంజీవిని ఢిల్లీ తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.



ఆహ్వాన పత్రికను చూపుతున్న చిరంజీవి, వెంకటేశ్వరమ్మ దంపతులు

బ్యాక్‌లాగ్ పోస్టులకు అర్హత పరీక్షలు ప్రారంభం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల ఖాళీల భర్తీలో భాగంగా డ్రెయిన్ క్లీనర్, గ్యాంగ్ మజ్దూర్ పోస్టులకు సంబంధించిన ప్రాథమిక అర్హత పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు నగరం సిద్ధార్థనగర్‌లోని జేసీ కాలేజీ ఆఫ్ లా కాలేజీలో పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తెలుగు, ఇంగ్లిష్ భాష, చదవడం, రాయడం వంటి అంశాల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నిర్వహణ తీరును జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ పరిశీలించారు. మంగళవారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన డ్రెయిన్ క్లీనర్ పోస్టుకు 86 మంది అభ్యర్థులకు 43 మంది, గ్యాంగ్ మజ్దూర్ పోస్టుకు 385 మంది అభ్యర్థులకు 228 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో డీఈఓ శైలజ, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్

- నిందితుల్లో ఇద్దరు మైనర్లు
- వారివద్ద నుంచి 20 కిలోల గంజాయి స్వాధీనం
- మరో నలుగురి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన ఏఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు

నగరంపాలెం: గంజాయి విక్రయించే నలుగురిని అరెస్ట్ చేసి, ఇరవై కిలోల గంజాయి సీజ్ చేశామని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో మంగళవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ వెల్లడించారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే ఒక లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, దీనిని చేబ్రోలు పోలీస్‌స్టేషన్ (పీఎస్) నుంచే ప్రారంభించామని అన్నారు. ముందస్తు సమాచారంతో మంగళవారం ఉదయం పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ పి.మహేష్‌కుమార్ పోలీస్ సిబ్బందితో చేబ్రోలు గ్రామం నందమూరికాలనీ ఒకటో వీధిలోని కట్టా శ్రీను అలియాస్ డబ్బా శ్రీను ఇంట్లో సుమారు ఇరవై కిలోల గంజాయి గుర్తించారన్నారు. పట్టుబడిన కట్టా శ్రీను, గుంటూరు నల్లచెరువు 8వ వీధి, నల్లచెరువు 20/2వ అడ్డరోడ్డులో ఉంటున్న ఇద్దరు మైనర్లతో కలిసి గత నెలలో విశాఖపట్నం జిల్లా అరకు వెళ్లి, 25 కిలోల గంజాయి కొనుగోలు చేసి, చేబ్రోలులోని కట్టా శ్రీను ఇంట్లో భద్రపరిచారన్నారు. ఇక కట్టా శ్రీను వద్దకు వట్టిచెరుకూరు మండలం కోవెలమూడి వాసి తోట రాజేష్, మరో ఇద్దరొచ్చి ఒక్కొక్కరు రెండు కిలోల గంజాయి తీసుకెళ్లేవారని, దాన్ని చిన్న పొట్లాలుగా చేసి చేబ్రోలు, తెనాలి పరిధిలోని విద్యార్థులు, స్పిన్నింగ్ మిల్లు కార్మికులు, నిరుద్యోగ యువతకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునేవారన్నారు. ఈ క్రమంలో కట్టా శ్రీను, తోట రాజేష్ తోపాటు ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేసి, 20 కిలోల గంజాయిను సీజ్ చేశామని చెప్పారు. పరారీలో ఉన్న మరో నలుగురి ఆచూకీ కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయని తెలిపారు. పట్టుబడిన ఒక మైనర్‌పై ఎన్‌డీపీఎస్, బైక్, గొలుసు చోరీ కేసులు నమోదై ఉన్నాయని అన్నారు. బైక్‌లు చోరీ చేసి వాటిని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు విక్రయించి, గంజాయి కొనుగోలు చేసేవారు. అయితే వీరి చుట్టు గొలుసు కట్టు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఈ తరహా కేసుల్లో పట్టుబడిన వారిపై సస్పెక్టెడ్ కేసులు, పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. పొన్నూరు పరిధిలో ఎక్కడా గంజాయి ఉండరాదనే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని అన్నారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ (సెబ్) ఎం.వెంకటేశ్వరరావు, తెనాలి డీఎస్పీ జనార్ధనరావు, పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్ఐ పి.మహేష్‌కుమార్, పలువురు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

గంజాయికి దూరంగా ఉండాలి..

యువత, విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఎవరైనా పిల్లలు గంజాయి తాగుతున్నట్లు తల్లిదండ్రులు గుర్తిస్తే, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి తాగితే కలిగే దుష్పరిణామాలపై అవగాహన, కౌన్సెలింగ్ చేయిస్తామన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడితే విధించే శిక్షల వివరాలను తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించి సమాచారం ఉన్నట్లయితే గుంటూరు పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 8688831568కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ చెప్పారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అనంతరం హెల్ప్‌లైన్ నంబర్ పోస్టర్లను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు.

బాల్య వివాహాల నివారణకు చర్యలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి పార్థసారథి

నగరంపాలెం: తల్లిదండ్రులు పిల్లల పెంపకంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ సంయుక్తంగా గుంటూరు తూర్పు, పశ్చిమ పరిధిలోని వార్డు పరిపాలనా కార్యదర్శులకు రెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్ బాల్య వివాహ నిషేధ నియమావళి- 2023పై నిర్వహిస్తోన్న అవగాహన కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణలో వార్డు పరిపాలన కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. బాల్య వివాహాల నివారణకు ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వాహనాలు నడిపే ప్రతి చోదకుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ బాల్య వివాహ నిషేధ నియమావళి- 2023ను జిల్లా బాలల పరిరక్షణాధికారి సి.హెచ్.విజయ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎ.అనిత, సంస్థ కార్యదర్శి సివిల్ జడ్జి టి.లీలావతి (సీనియర్ డివిజన్), జిల్లా బాలల పరిరక్షణా విభాగం లీగల్, ప్రొబేషన్ అధికారి బి.వాసంతి, లీగల్ కౌన్సిలర్ పద్మావతి, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా సమన్వయ కర్త కె.సమీర్‌కుమార్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సమగ్ర శిశు అభివృద్ధి అధికారిణి టి.కృష్ణవేణి, సహాయ అధికారిణి సీహెచ్ చంద్రకళ పాల్గొన్ని చట్టాలపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

ప్రముఖ కంటి వైద్యులు యడ్ల శ్రీరామమూర్తి మృతి


డాక్టర్ యడ్ల శ్రీరామమూర్తి (ఫైల్)

గుంటూరు మెడికల్: ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ యడ్ల శ్రీరామమూర్తి (81) మంగళవారం కన్నుమూశారు. గుంటూరు కొత్తపేట హోండా షోరూం వెనుక ఉన్న తన గృహంలో మృతి చెందారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ యడ్ల హనుమాన్‌ప్రసాద్ వెల్లడించారు. డాక్టర్ శ్రీరామమూర్తి కొద్దిరోజులుగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. గుంటూరులో 1982లో శ్రీ రేణుక నేత్రాలయాన్ని స్థాపించి లక్షలాదిమంది కంటి జబ్బురోగులకు చికిత్స చేశారు. కోస్తాంధ్రాలో మొట్టమొదటిసారిగా 1989లో కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి రికార్డు సృష్టించి వార్తల్లోకి ఎక్కారు. డాక్టర్ శ్రీరామమూర్తికి కుమారుడు డాక్టర్ హనుమాన్‌ప్రసాద్‌తో పాటుగా కుమార్తెలు రేణుక, సునీత ఉన్నారు. డాక్టర్ శ్రీరామమూర్తి మృతికి గుంటూరుకు చెందిన పలువురు సీనియర్ వైద్యులు, ఐఎంఏ నేతలు, కంటి వైద్య నిపుణులు సంతాపం వ్యక్తం చేశారు.

9వ తేదీ వరకు శ్యామలానగర్ రైల్వే గేటు మూసివేత

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంటూరు–నల్లపాడు మధ్య డీప్ స్క్రీనింగ్స్ ఆఫ్ ట్రాక్స్ కోసం శ్యామలానగర్ రైల్వే గేటును ఈనెల 6వ తేదీ నుంచి 9వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు తాత్కాలికంగా మూసివేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. గుంటూరు – నల్లపాడు మధ్య లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద అత్యవసర మరమ్మతుల కారణంగా గేటును మూసివేశామని, ప్రయాణికులు గమనించి సహకరించాల్సిందిగా తెలిపారు. ఇటుగా ప్రయాణించే వాహనదారులు కంకరగుంట రోడ్ ఓవర్ బ్రిడ్జ్, రోడ్ అండర్ బ్రిడ్జ్ మీదుగా ప్రయాణించాల్సిందిగా సూచించారు.

నేటి నుంచి నల్లపాడు–పేరేచర్ల గేటు మూసివేత..

నల్లపాడు–పేరేచర్ల మధ్య అత్యవసర పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 7వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 8వ తేదీ రాత్రి 8 గంటల వరకు గేటును మూసివేస్తున్నామని సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ తెలిపారు.

ఢిల్లీ పంద్రాగస్టు వేడుకలకు ఏఎన్‌యూ విద్యార్థులు


ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ: ఈనెల 15న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. వర్సిటీ పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ చదువుతున్న బుర్ర దివ్యశ్రీ, ఫార్మా డీ చదువుతున్న ఎస్.రేవంత్ సాయి ఈ వేడుకలకు ఎంపియ్యారు. వీరిని మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం విద్యార్థులు సామాజిక సేవలో అన్ని వర్గాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 20 మంది పాల్గొంటుండగా వారిలో ఏఎన్‌యూ నుంచి ఇద్దరు ఉండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వి.దివ్యతేజోమూర్తి, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశంపై గుంటూరు భారీ స్కోరు

- తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 372 పరుగులు చేసిన గుంటూరు జట్టు
- రసవత్తరంగా సీనియర్ మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ పోటీలు
- డబుల్ సెంచరీతో అదరగొట్టిన గుంటూరు బ్యాట్స్‌మెన్ కె.మహీప్



మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి క్రికెట్ టౌన్‌షిప్‌లో కల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ సీనియర్ మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ మ్యాచ్‌లో గుంటూరు జట్టు చెలరేగిపోవడంతో భారీ స్కోర్ సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు నిర్ణీత 90 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 372 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్‌మెన్ కె.మహీప్ 274 బాల్స్‌లో 5 సిక్స్‌లతో 17 ఫోర్లతో చెలరేగిపోయి 274 పరుగులు సాధించాడు. మరో బ్యాట్స్‌మెన్ సూర్యవంశీ 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 78 పరుగులు చేశాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు 372 పరుగులు భారీస్కోర్ సాధించింది.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం

- సుప్రీం తీర్పును రాష్ట్రప్రభుత్వం వెంటనే అమలుచేయాలి
- ఎమ్మార్పీయస్ జిల్లా అత్యవసర సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ


ఉద్యమ అమరవీరులకు పుష్పాంజలి ఘటిస్తున్న నేతలు

తెనాలి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతిబింబమని, ఈ తీర్పును రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు, ఎమ్మార్పీఎస్ జన్మస్థలం ఈదుమూడి మాదిగపల్లి తల్లికి, మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు అంకితమిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ గుంటూరు జిల్లా అత్యవసర సమావేశం మంగళవారం స్థానిక కొత్తపేటలోని ఎన్జీఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. సమితి రాష్ట్ర కో–ఆర్డినేటర్ కటేవరపు కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత అధికారాన్ని ఆయా రాష్ట్రాల శాసనసభలకు బదలాయిస్తూ ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈ తీర్పుపై సానుకూలంగా స్పందించిన అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టులో తీర్పు వచ్చిన సందర్భంగా దీనిపై చర్చించి తదుపరి కార్యాచరణతో ముందుకు వెళ్లే వ్యూహంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం సుప్రీ తీర్పు ప్రకారం రిజర్వేషన్లలో వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మరో పోరాటానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. తొలుత ఉద్యమ అమరవీరులకు పుష్పాంజలి ఘటించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కిన్నెర నాగరాజు మాదిగ, చిలువూరు నాగరాజు మాదిగ, రాష్ట్ర లీగల్ సెల్ నాయకుడు ఏటుకూరి విజయకుమార్ మాదిగ, శ్రీధర్ మాదిగ, కొమ్మూరి సుధాకర్ మాదిగ, బుజ్జమ్మ మాదిగ, గౌరీ రెల్లి, కొమ్మూరి గరటయ్య మాదిగ, నలుకుర్తి కోటేశ్వరరావు మాదిగ, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అవయవదానం పుణ్యకార్యం


జీఎస్టీ చీఫ్ కమిషనర్ సంజయ్‌రాఠీకి స్వాగతం పలుకుతున్న జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

లక్ష్మీపురం: అవయవదానం పుణ్యకార్యమని కస్టమ్స్, జీఎస్టీ విశాఖపట్నం జోన్ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ అన్నారు. స్థానిక గుంటూరు జీఎస్టీ కార్యాలయంలో అంగ్దాన్ జన్ జాగృత అభియాన్, అవయవ దానం దినోత్సవంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంజయ్‌రాఠీ మాట్లాడుతూ అవయవాల దానంతో ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహించిన గుంటూరు జీఎస్టీ అధికారులను ఆయన అభినందించారు. జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవయవదానం ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. స్పెక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి అవయవ దానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సీజీఎస్టీ గుంటూరు కమిషనరేట్, సీజీఎస్టీ తిరుపతి కమిషనర్, కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్, విజయవాడకు చెందిన 200 మంది అధికారులు పాల్గొని అవయవదానంపై ప్రతిజ్ఞ చేశారు. జీఎస్టీ అధికారులు బి.లక్ష్మీ నారాయణ, ఉపేంద్ర ధ్రువ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికి వందరోజుల ప్రణాళిక

- సాగునీటి కాలువల మరమ్మతులకు చర్యలు
- సీసీఆర్సీ కార్డులకు వ్యవసాయ రుణాలు
- పశువులకు వ్యాక్సినేషన్
- మత్స్య సంపద పెంపునకు చర్యలు
- ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రోత్సాహం
- కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రగతికి వంద రోజుల అభివృద్ధి ప్రణాళిక ప్రకటించిందని, దీనికి సంబంధించిన అంశాలను ఆయా శాఖ అధికారులు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విజన్‌కు సంబంధించి ఇన్నోవేటివ్‌గా అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని భూములన్నింటినీ సాగులోకి తీసుకొచ్చేందుకు అధికారులు వివరాలు సేకరించాలన్నారు. సీసీఆర్సీ కార్డులందరికీ రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్దేశిత లక్ష్యాలకు పూర్తి చేయాలని పేర్కొన్నారు. పాడిపరిశ్రమతోపాటు, గొర్రెలు, మేకల పెంపకం పరిశ్రమల ఏర్పాటుకు పశు సంవర్థక శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మత్స్య సంపద పెంపునకు అవసరమైన పరిస్థితులను గుర్తించడంతోపాటు, ఉన్న అవకాశాలను కూడా పెంచుకోవాలని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు సహకారం అందించాలని వివరించారు. సాగునీటి కాలువల మరమ్మతులు, ఆధునికీకరణ, నిర్వహణపై ప్రతిపాదనలు అందించాలన్నారు. నిత్యవసర వస్తువుల ధరలపై లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లయి అధికారులు పర్యవేక్షించాలన్నారు. అధిక ధరలకు విక్రయించకుండా చూసుకోవాలన్నారు. గురుకుల సంక్షేమ హాస్టళ్లలో ఉత్తీర్ణత శాతం పెంచేలా పరిశీలించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ, డీఆర్వో పెద్దిరోజా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, డీఎస్ఓ కోమలి పద్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు మాయం కాలేదు


రికార్డులు చూపిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రశాంతి

పొన్నూరు: పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో భూములు రికార్డులు మాయమైనట్లు ఓ పత్రికలో వచ్చిన కథనం అవాస్తవమని మంగళవారం తహసీల్దార్ తేల్చారు. రికార్డులు మాయం కాలేదని, పట్టణంలోని డీవీసీ కాలనీలో పేదల పట్టాలకు చెందిన అన్ని రికార్డులూ తహసీల్దారు బీరువాలోనే భద్రంగా ఉన్నాయని స్పష్టం చేశారు. పట్టణంలోని సాక్షి భావనారాయణ స్వామి ఆలయానికి చెందిన 25 ఎకరాల భూమిలో 1998లో పేదలకు పట్టాల పంపిణీ జరిగింది. ఆ భూమికి సంబంధించి కొందరు నకిలీ పట్టాలు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నారని ఇచ్చిన ఫిర్యాదుతో సీఐడీ అధికారులు విచారణ చేసి కీలక దస్త్రాలు తీసుకువెళ్లి, కొన్ని రికార్డులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉంచినట్లు సమాచారం. గత నెల 9న ఆ భూముల డూప్లికేట్ పట్టా కోసం అర్జీ వచ్చింది. ఈ నేపథ్యంలో కార్యాలయంలో సంబంధిత రికార్డులు కనబడలేదు. దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్ సీనియర్ అసిస్టెంట్‌కు మెమో జారీ చేశారు. దస్త్రాల మాయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఓ పత్రికలో కథనం ప్రచురితమైంది. అయితే కార్యాలయంలోని బీరువాలోనే రికార్డులన్నీ ఉన్నాయని సిబ్బంది మంగళవారం తెలిపారు.

బీరువాలోనే భద్రం

గత పది రోజుల నుంచి రికార్డులు కనిపించలేదు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీనియర్ అసిస్టెంట్‌కు మెమో జారీ చేశాం. ఆ మెమోను ఆయన తీసుకోలేదు. మంగళవారం కార్యాలయం బీరువాలోనే రికార్డులన్నీ ఉన్నట్లు గుర్తించాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

– ఇనుకపల్లి ప్రశాంతి, ఇన్‌చార్జ్ తహసీల్దార్, పొన్నూరు

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4800, గరిష్ట ధర రూ.6100, మోడల్ ధర రూ.5500 వరకు పలికింది.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు గుజ్జనగుండ్ల సర్కిల్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 8న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సువర్ణ కుటీర్ డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్, పేటీఎం, టెక్‌బీఎం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, జయలక్ష్మి ఆటోమొబైల్స్‌లలో ఉద్యోగాల భర్తీ కోసం టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరగనున్న ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని, ఇతర వివరాలకు 98668 22697, 87907 90762 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్కూటీలోని రూ. 6 లక్షల నగదు చోరీ

ప్రత్తిపాడు: పట్టపగలు స్కూటీలో ఉంచిన నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పెదనందిపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గణేశన మురళీకృష్ణ మంగళవారం సాయంత్రం ప్రత్తిపాడులోని యూనియన్ బ్యాంకులో రూ.6 లక్షల నగదును విత్ డ్రా చేశాడు. ఆ నగదును స్కూటీలో పెట్టి తాళం వేసుకుని ఇంటికి బయల్దేరాడు. ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులోని ఓ కూరగాయల దుకాణం వద్ద స్కూటీ నిలిపి కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. కూరగాయలు కొనుక్కుని తిరిగి వచ్చేప్పటికి స్కూటీ సీటు తెరచి ఉండటం, అందులో ఉన్న నగదు మాయమవ్వడాన్ని గమనించిన మురళీకృష్ణ ప్రత్తిపాడు పోలీసులను ఆశ్రయించాడు.

మంగళగిరిలో నేడు జాతీయ చేనేత దినోత్సవం

మంగళగిరి: పట్టణంలోని ఎన్ఆర్ఐ జంక్షన్‌లోని నేతన్న సర్కిల్‌లో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత ఏడీఏ వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తోపాటు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, పలువురు చేనేత జౌళి సహాయ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

‘దేశీ’య రైతుకు గౌరవం

- అత్తోట బాపారావుకు ఈషా ఫౌండేషన్ పురస్కారం
- ప్రకృతి, దేశీ విధానంలో వరి పంటల సాగుతో సత్ఫలితాలు
- భూమి భారతి పేరుతో దేశీ వరి విత్తన నిధి
- తొమ్మిదేళ్ల అవిరళ కృషికి దక్కిన గుర్తింపు


బాపారావుకు ఈషా ఫౌండేషన్ పురస్కారం

తెనాలి: ప్రకృతి వ్యవసాయాన్ని, దేశీ వరి సాగును చేపట్టి, తోటి రైతులను ప్రోత్సహిస్తూ విస్తృతం చేస్తున్న తెనాలికి చెందిన ప్రకృతి రైతు యర్రు బాపారావుకు తమిళనాడుకు చెందిన ఈషా ఫౌండేషన్ ఉత్తమ రైతు పురస్కారం లభించింది. ఈషా ఫౌండేషన్‌చే గత నెల 28న తమిళనాడులోని వెల్లూరులో నిర్వహించిన భారతీయ సంప్రదాయ వరి, ఆహారోత్పత్తుల ఉత్సవంలో ఈ గౌరవాన్ని స్వీకరించారు. వీరితోపాటు కృష్ణాజిల్లాకు చెందిన కె.రంజిత్ కుమార్, పశ్చిమగోదావరి రైతు జి.రాము, శ్రీకాకుళం జిల్లా రైతు బి.జగ్గారావు ఈ పురస్కారాన్ని అందుకున్నవారిలో ఉన్నారు.

ఉద్యోగం వదిలి వచ్చి..

తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలం అత్తోట యర్రు బాపారావు స్వస్థలం. ఉన్నత విద్యావంతుడు. హైదరాబాద్‌లో గ్రాఫిక్ డిజైనర్, 2డీ ఏనిమేటర్‌గా ఉద్యోగం చేసేవాడు. సురక్షిత ఆహారం ప్రాధాన్యాన్ని గుర్తించి సొంతూరులోనే ప్రకృతి వ్యవసాయం చేపట్టాడు. తనకున్న ఎకరన్నర సొంత భూమిలోనే ప్రకృతి వ్యవసాయం ఆరంభించాడరు. తర్వాత మరో ఏడెకరాల కౌలు భూమికీ సాగును విస్తరించాడు. దేశీ వరి విత్తనాలను సేకరించి, తాను పండిస్తూ, తోటి రైతులకు అందిస్తూ, వాటి సాగును విస్తృతం చేస్తూ వచ్చాడు. ఈవిధంగా తొమ్మిదేళ్ల క్రితం ప్రకృతి సేద్యం ఆరంభించిన బాపారావు 365 రకాల దేశీ వరి విత్తనాలను సాగు చేస్తున్నాడు. భూమి భారతి పేరుతో దేశీ వరి విత్తన నిధిని అత్తోటలో ‘తానా’ సహకారంతో ఆరంభించాడు. ఆయన స్ఫూర్తి, ప్రోత్సాహంతో ఇప్పుడు అత్తోటలోని 60 మంది రైతులు 85 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం, దేశీ వరి సాగు చేస్తున్నారు. తాను, తోటి రైతులు పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సంబంధిత స్టాళ్లలో, సోషల్ మీడియా ద్వారా విక్రయాలు చేస్తున్నారు. ప్రవాస భారతీయులు మౌనికా రెడ్డి దంపతుల సాయంతో విజయవాడలోని కనకదుర్గ అమ్మ వారికి , మరో ఎన్ఆర్ఐ తాళ్లూరి జయశేఖర్ దంపతుల సాయంతో భద్రాచలంలోని సీతారాముల వారికి ఏడాది పొడవునా నైవేద్యం కోసం బాపారావు, అత్తోటలోని ఇతర రైతులు కలిసి పండించిన దేశీ వరి బియ్యాన్ని పంపుతుండటం మరో విశేషం! ఈ కారణంగానే ఆయన్ను ఈషా ఫౌండేషన్ ఉత్తమ రైతుగా సత్కరించింది.

విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

గుంటూరు సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి

చేబ్రోలు: విద్యార్థుల్లోని సృజనాత్మకత పెంచి కొత్త ఆవిష్కరణల దిశగా వారిని తీర్చిదిద్దాలని, బాల శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని గుంటూరు సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి చెప్పారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగే రీజినల్ లెవల్ వర్క్‌షాపు సోమవారం ప్రారంభమైంది. ఏలూరు, కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి అటల్ టింకరింగ్ ల్యాబ్ సైన్స్ ఉపాధ్యాయులు 35 మంది పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లోని వివిధ పరికరాలు ఎలా ఉపయోగించాలి? ప్రొజెక్టర్ ల్యాప్‌టాప్ పబ్లిక్ అడ్రస్ సిస్టం మొదలు ఎలక్ట్రానిక్ పరికరాలతో విద్యార్థులకు సులువైన పద్ధతుల్లో బోధనా విధానాలను వివరించారు. ఏపీసీ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ మనం నిత్యం ఎదుర్కొనే సమస్యలకు కొత్తగా పరిష్కారమార్గాలను కనుగొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఏపీఎస్ ప్రసాద్, ఆర్.సుబ్బారావు, జిల్లా సైన్స్ అధికారి గౌస్, హెచ్ఎం ఎం.ఏడుకొండలు పాల్గొన్నారు.